# జీవితం – జీవితం

గ్రంథాలయం వరండాలో నన్ను ఆపి.—

"నీ జీవితంలో గొప్ప విశేషం ఎప్పుడైనా సంభవించిందా?" అని అకస్మాత్తుగా ప్రశ్నించాడు.

"లేదు."

"పోనీ ఏదైనా చిన్న విశేషం గూడా కలగలేదా?"

"ఉహూ! నాకు జ్ఞాపక ముస్నంతవరకూ ఏమీ కలగలేదు."

"ఇకముందు జరుగుతుందనైనా నమ్మకముందా?"

"లేదు."

"జీవితంమీద విసుగు పుట్టటం లేదటోయ్?"

"విసుగా? కలగకేం? కలుగుతుంది అప్పుడప్పుడు. – మాత్రం, కాని పనుల్లో లీనమై మరిచిపోతాను."

మా వూళ్ళో వీధిబడి పంతుల్ని చెట్టుకింది ప్లీడరు చెంచయ్య చూసి నట్లుగా చీదరించుకొనిచూసి, సుబ్బారావు లోపల పుస్తకాలను వెతుక్కోటానికై వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత పది రోజులు వరసగా సుబ్బారావును పరికించి చూశాను. ఏదో అశాంతితో మథన పడిపోతున్నట్లుగా తోచింది.

మా వూరి లైబ్రరీ పుస్తకాలకు అడపా దడపా బూజు దులిపేవాళ్ళలో నే నొకణ్ణి. కాని సుబ్బారావుకు అ స్తమానమూ లైబ్రరీతోనే పని. మా వూరి కొత్తళ్ళుళ్ళ ఖాతాలో ఖర్చయిన పుస్తకాల్ని మినహాయించగా మిగిలినవాటిని అటునుంచి యిటు ఒకసారి, ఇటు నుంచి అటు ఒకసారయినా చదివేసి వుంటాడు. దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక, వార్షిక పత్రికల్లో అచ్చు పడ్డ, ఏ మంచి చెడ్డ, పాత—కొత్త, నీతి—బూతు కథానికైనాసరే సుబ్బారావు తప్పక చదివి వుండాలి. అతనిది కథానికా ప్రపంచం.

మా యిద్దరిదీ స్నేహం కాదు, చాలావరకు బలవంతపు పరిచయం. మా గ్రామంలో సంఖ్యా బలం హెచ్చుగాలేని "రికామీలలో" నేనూ సుబ్బా రావూ జమ అవుతాము. బస్తీలకు చదువులకుపోయి సెలవు దినాల్లో స్వర్గాల నించి వూడిపడ్డట్టు దిగి—ఏరాభాయ్, లాస్ట్ వీక్ పిక్చర్ అద్భుతంగా వుంది గదూ భాయ్, "అది" మోతగా యాక్టు చేసిందిరా—మొదలైన సినిమా పరిభాషా వ్యాసంగపరులుగా చెలరేగే బొమ్మల బుష్‌కోట్ల స్నేహితులంటే—చెప్పొద్దూ— మా యిద్దరికీ కొంచెం మంటే. చుట్టా బీడీల అలవాట్లు లేవు. రాజకీయాలు తెలీవు. సినిమా అంటే చలిజ్వరం రాదు. ఉద్యోగం చెయ్యమని సలహా చేప్పే వాళ్ళు కాని, బాధించేవాళ్ళు గాని యిద్దరికీ లేరు. మాకు పొద్దుపోవటం సమస్య గాదు. సుబ్బారావుకు కాల్పనిక కథా జగత్తున్నది. నాకు కాలవ గట్టున్నది. గ్రంథాలయపు వరండాలో మేము కలిసుకొనక తప్పదూ చిరునవ్వులు పంచు కొనకా తప్పదు. కాల్పనిక కథా జగతిలోని సుబ్బారావుకు ఇహలోకం రుచించకపోవటంలో విశేష మేమీలేదు.

*　　*　　*

సుబ్బారావు తన జీవితంలో కొత్త మలుపు కోసం ఎదురుచూస్తున్నాడు. ఏదో ఒక శుభదినాన అనుకొనని రూపాన, అనుకొనని ముహూర్తాన-ఏదో గొప్ప సంఘటన తన జీవితగతిని మార్చి తీరుతుంది. ఆ మార్పే కొత్త మలుపు. ఆనాటితో గాని వాసనలేని పువ్వువలె, ఉప్పులేని కూర రుచివలె—యిన్నాళ్ళ నుండి బదుకుతున్న రంగులేని రోజులు మారిపోవు.

తన పేరు హేమచంద్ర సర్కారో, నళినాక్ష సన్యాలో, అక్షయ కుమార చక్రవర్తో, అరబింద ముఖర్జీయో ఎందుకు కాగూడదు? ఏమిటీ పేరు? స్కూలు హాజరు పట్టీనిండా—హజారు సుబ్బారావులు ఏ ప్రత్యేకతా, ఏ పరిమళమూ లేని పాతపేరు యీ పేరు.

"అమ్మా, ఎవరే నాకీ పేరు పెట్టింది?" అని రెట్టించి తల్లి నడిగాడు.

'ఎవరేమిట్రా? నువ్వు పుట్టింది సుబ్బారాయుడి షష్ఠి అని మరిచి పోయావురా? పోయి చెంపలేసుకో. మొన్న చెవులో చీము కారిందన్నావ్. రేపటి వారం దణ్ణం పెట్టుకొని కొబ్బరికాయన్నా కొడుదువు గాని"

ఇదీ వరస.

సుబ్బారావుకు మహా యిష్టమైనవి పెళ్ళి చూపుల కథలు. నలకూబరుడి వంటి యువకుడు—పెద్దలతో పెళ్ళి చూపులకు పోవటం, అలంకరించబడ్డ పెళ్ళి కూతురు తలుపు సందునుంచి పిల్లవాణ్ణి చూడటం, ఆశ్చర్యపోవటం—చివరకు ఆ పిల్లవాడు స్కూల్లో తన మీద కొక్కిరాయి వేషాలు సాగించినవాడే కావటం లేక ఒక పిల్లను చూపి యింకో పిల్లను పెళ్ళి చేయటం. ఆ మోసాన్ని గదిలో తెలుసుకొని, పెళ్ళికొడుకు మేడ మీది కిటికీగుండా చూస్తూ ఆలోచిస్తూంటే ఆమె వచ్చి కన్నీళ్ళతో అతని కాళ్ళు కడిగి వేడుకొనటం.

సుబ్బారావు జీవితం యీ మధురానుభూతులకు నోచుకోలేదు. అతనికి మేనరికం వుంది—సుబ్బులన్న పిల్ల. ఆ అమ్మాయి గూడా సుబ్బారాయుడి షష్టినాడే జన్మించింది. ఆ అమ్మాయి తల్లి గర్భంనుండి భూమిని స్పర్శించిననాడే—'ఒరే, నీకు పెళ్లాం పుట్టిందిరా' అని లోకం ఘోషించింది.

ఎందు కింక తన వంకర బతుకు? చిన్న మెల్ల కన్ను పెద్ద నోరు, ఏ మాటబడితే ఆ మాటను కొత్తా పాతా లేకుండా దులిపేసే–పల్లెటూరి సుబ్బులు–తనకు సహచారిణి, ధర్మపత్ని, ప్రియతమురాలు కాబోతున్నదా? కొన్నాళ్ళు వాళ్ళ నాన్నా, సుబ్బులు నాన్నా మాటల్లేకుండా వుంటే—యీ సంబంధం తప్పిపోయింది దేవుడా అని సంతోషించాడు. ఆ వంక బెట్టుకొని అయిదారేళ్ళనుంచి సుబ్బులుగారి పల్లెటూరే చూడలే. కాని అమ్మ వెళ్ళి అన్నీ చక్కజేసింది. మామయ్య వచ్చి చూసి వెళ్ళాడు. నాన్న కూడా వెళ్ళొచ్చాడు వాళ్ళ వూరు. వెళ్ళొచ్చి వూరుకోలేదు—"ఒరేయ్, సుబ్బుల్ని దిట్టంగా చదివించార్రా. యేం పాటలు పాడిందని? ఆంధ్రా మెట్రిక్ కట్టి ప్యాసయింది. తస్సాదియ్యా నేర్పిస్తే ఆడపిల్లలకు మాత్రం చదువు లబ్బుతై గదా చక్కగా" అని రోజూ మెచ్చుకొనేవాడు. కాని అంతటితో వూరుకోలేదు–"నువ్వొకసారి వెళ్ళిరారా. యీడొచ్చిన పిల్ల. వాళ్లూ లగ్నం అని తొందర చేస్తున్నారు. రేపు మాఘంలో ముడి వెయ్యాల్సిందే" అని అంటున్నాడు.

సుబ్బుల్ని చేసుకోకముందే తను— "ఎదురు చూస్తూన్న సంఘటన" సంభవిస్తుందా అని వేచిచూచి వేసారి పోయాడు సుబ్బారావు. తనూ సుబ్బులూ చిరకాలం భార్యా భర్తలుగా జీవించబోయేది లేదని ధైర్యం చెప్పుకొన్నాడు. కథల్లోని రెండో పెళ్ళి కొడుకుల అనుభవాలన్నీ స్మృతికి తెచ్చుకొన్నాడు.

సుబ్బారావు పట్నం వెళ్ళొచ్చాడు. ప్రయాణంలో అతను ఏ సంఘటన లోనూ యిరుక్కోలేదు. చివరికి పట్నంలో జేబు దొంగలు అతని మనీపర్సును కొట్టెయ్యాలని గూడా ప్రయత్నించలేదు.

కాని ఎన్నిజేసినా కాబోయే మామగారింటికి వెళ్ళక తప్పిందిగాదు సుబ్బారావుకు. అతనికి యువరాజోచిత మర్యాదలు లభించిన వక్కడ. అల్లుడికి జరిగే భోగాలు యిట్టాంటివని తెలిసిందక్కడ. అతనికి వరండాలోనే గుర్రబ్బండిదిగుతూండగానే ఒకమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయికి చిన్న మెల్ల కన్ను. కాని ఆ కన్ను అసహ్యంగా లేదు. ఆభరణంగా వుంది.

ఆ అమ్మాయి అతణ్ణి చూచి తుర్రున లోనికి పారిపోలేదు. నెమ్మదిగా నడిచి వెళ్ళింది. ఆ అమ్మాయే సుబ్బులని తెలుసుకొని సుబ్బారావు కొంచెం ఆశ్చర్య పడ్డాడు. అతనక్కడ ఒక వారంరోజులదాకా వున్నాడు. ఈ వారంలో ఆ చామనచాయ పిల్ల అతనితో నాలుగైదు మార్లు మాట్లాడింది గూడా. వాళ్ళమ్మ పాడమన్నప్పుడల్లా నదురూ, బెదురూ ఎక్కువ లేకుండా చక్కని, కమ్మని పాటలు పాడింది సుబ్బులు. సుబ్బారావుకు తోచింది— ఏమిటో? పాటల తర్వాత అతనికి తోచలేదు. ఎందుకో?

నాన్నగారినుంచి వుత్తరం వచ్చింది బయలుదేరి రమ్మని. సుబ్బారావు కాబోయే మామగారికి రేపే వెళ్తానని చెప్పాడు. ఆ సాయంత్రం వాళ్ళిద్దరూ సినిమా చూసి కొంచెం ఆలస్యంగా యింటికి చేరారు. గదిలో వాళ్ళమ్మతో గట్టిగా వాదిస్తున్న సుబ్బులు కంచు గొంతు వీధివాకిలి దాకా వినిపిస్తున్నది.

"నేను చేసుకోనంటే చేసుకోనమ్మా. బలవంతంగా చేస్తానంటారా? నేను నుయ్యో గొయ్యో చూసుకుంటా?"

"వాడికేం తక్కువనే? నీకేం తీసిపొయ్యాడనే? నిక్షేపంలాంటి పిల్లాడు"

"నీకేం తెలుసు? బొత్తుగా ప్రపంచ జ్ఞానం అంటే జనరల్ నాలెడ్జి లేదు. ఏ దేశానికి ఏ పట్నం రాజధానో గూడా తెలీదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు నటిస్తాడు. అంతా తెలివితక్కువతనాన్ని కప్పిపుచ్చుకోటానికి చేసే యత్నం"

"వాడేం వుద్యోగం చెయ్యాలటే? కాలుమీద కాలువేసుకొని పది కాలాల పాటు దర్జాగా బతగ్గలడు"

"అందుకే అసలు పనికి రాదంటున్నా. నువ్వు లక్షచెప్పు నేను బి. యే. ప్యాసయిన పిల్లవాణ్ణి, నాకన్నా ఎక్కువ చదువుకొన్నవాణ్ణి తప్పితే చేసుకోను. కావాల్సింటే నాన్నకు గూడా చెబుతా."

"ఇన్నాళ్ళనుంచీ మరి కడుపులో మాట మాకు చెప్పక పోతివేమే నిర్భాగ్యురాలా"

"ఇప్పు డడిగారు గనక చెప్పగలిగాను. వెనక అడగలేదు"

సుబ్బులు అమ్మ ఏడవటం మొదలుబెట్టింది. సుబ్బారావును వరండా చీకట్లోనే వుంచి వాళ్ళ మామ లోపలిగదిలోకి వెళ్ళి చాలా ఆలస్యంగా తిరి గొచ్చాడు. మెల్లగా కస్సు బుస్సులనుకొంటూ జరిగిన సంభాషణ సుబ్బారావు చెవిన పడలేదు. మామయ్య తిరిగివచ్చి—సుబ్బారావుమీద చెయ్యివేసి మృదువుగా తడివి—"నాయనా! విన్నావుగా. ఒక్కగా నొక్క పిల్ల. దాని యిష్టమే మా యిష్టం. ఈ కాలం పిల్లలు స్వయంగా నమ్మితేనేగాని అంగీక రించరు. నీకు తెలీందేముంది. నాన్నకు నెమ్మదిగా రాస్తాను. రేపు పోయి సంగతి సందర్భాలు చెప్పు. నువ్వు మాత్రం కించపడ్డావంటే ఒట్టు" అన్నాడు.

* * *

సుబ్బారావును లైబ్రరీలో అతను ఆపిన పద్ధతిలోనే నేనూ ఆపేశాను.

"సుబ్బారావ్. అప్పుడడిగావే. నా జీవితంలో ఒక విశేషం జరిగింది."

"ఆ"

"వింటావా? చెప్పనా?"

"నాకు ఒంట్లో కులాసాగాలేదు. తరువాత మాట్లాడుకుందాం."

సుబ్బారావు గ్రంథాలయానికి రావటం బొత్తిగా మానేశాడు. నాకు జరిగిన సంఘటన అతనితో చెప్పేందుకు చాలాదినాలు ఎదురుచూశాను.

చివరికి – అతను ఎదురుచూస్తూన్న గొప్ప సంఘటన – జరిగివుండాలి అని నాలో నేను తీర్మానించు కొన్నాను. ○

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక